రోగుల ముంగిట్లో వైద్యం

విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో నాణ్యమైన సేవలు



మద్దిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది





తునివలసలోని విలేజ్ హెల్త్ క్లినిక్



మద్ది గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్

గతంలో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి. అంతకు మించి ఏదైనా పెద్ద సమస్య అయితే జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రికి వెళ్లాల్సిందే. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తే పేదింటి రోగులు ఆర్థికంగా చితికి పోవాల్సిందే... ఇలాంటి పరిస్థితుల్లో నాలుగున్నరేళ్ల కిందట అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో రోగుల ఇంటి ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. సచివాలయ వ్యవస్థలో భాగంగా ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పల్లె ప్రజల వైద్య అవసరాలు తీర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఏ చిన్న సమస్య వచ్చినా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడంతో గ్రామీణులకు ఉపయోగకరంగా ఉంటోంది. ముఖ్యంగా కేంద్రాల్లో 167 రకాల మందులు రోగులకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. పేద ప్రజల అవసరాలు గుర్తించి, అండగా నిలవడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎప్పుడూ ముందుంటారని నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– పద్మనాభం

45
నియోజకవర్గంలో మొత్తం విలేజ్ హెల్త్ క్లినిక్‌లు (ఆనందపురంలో 18, పద్మనాభంలో 15, భీమునిపట్నంలో 12)

1,20,010
2020 నుంచి ఇప్పటి వరకూ వైద్య సేవలు, మందులు పొందిన రోగులు

రూ.10.24 కోట్లు
పద్మనాభంలో 13 భవనాల నిర్మాణానికి కేటాయించిన నిధులు

రూ.10.47 కోట్లు
ఆనందపురంలో 14 భవనాల నిర్మాణానికి కేటాయించిన నిధులు

రూ.94.20 లక్షలు
భీమునిపట్నంలో 9 భవనాల నిర్మాణానికి కేటాయించిన నిధులు

గ్రామంలోనే మందుల సరఫరా



లివర్ వ్యాధితో బాధపడుతున్నాను. గతంలో కేజీహెచ్‌కు వెళ్లి మందులు తీసుకునేవాడిని. కేజీహెచ్ దూరం కావడంతో వ్యయ ప్రయాసలకు గురయ్యేవాడిని. ఇప్పుడు మూడు నెలల నుంచి కేజీహెచ్‌కు వెళ్లడం లేదు. తమ గ్రామంలోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మందులు ఇవ్వడంతో ఇక్కడే తీసుకుంటున్నాం. నిమిషాల వ్యవధిలో మందులు తీసుకుని ఇంటికి వెళ్లిపోతున్నా.

– బి.సన్యాసినాయుడు, మద్ది గ్రామం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



గ్యాస్ట్రిక్‌తో బాధపడుతున్నా. గతంలో రేవిడి పీహెచ్‌సీకి వైద్యం కోసం వెళ్లే వాడిని. అక్కడి నుంచి మందులు తీసుకోవడానికి ఇబ్బంది పడేవారం. ప్రస్తుతం తమ గ్రామంలోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మందులు సరఫరా చేస్తుండడంతో ఇక్కడే తీసుకుంటున్నా. తమ ఇంటి పక్కనే మందులు ఉచితంగా అందించడం చాలా బాగుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– జి.పైడమ్మ, తునివలస

రైతులకు త్వరలో పరిహారం

భీమునిపట్నం: తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు త్వరలో ప్రభుత్వ పరంగా నష్ట పరిహారం అందిస్తామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ మూడు మండలాల్లో పంటలు దెబ్బతినడంతో రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏ మేరకు, ఏ పంటకు నష్టం వాటిల్లిందన్న సమాచారాన్ని అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. తాను కూడా ఇక్కడి పరిస్థితులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వ్యవసాయశాఖ జేడీ అప్పల స్వామి, డీఈ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి త్వరలో భూమిపూజ



స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట వద్ద జనవరి ఒకటో తేదీ నాటికి ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన అధికారులతో కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్, డిపోకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. దివీస్ లేబొరేటరీ యాజమాన్యం కాంప్లెక్స్ నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు కేటాయించనున్నట్టు తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణానికి ముందు శివాలయం ఎదురుగా పల్లంగా ఉన్న ప్రదేశాన్ని చదును చేయించాలని అధికారులకు సూచించారు. ఆయనవెంట జెడ్పీ రాము, స్థానిక నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

శివాలయంలో అన్నదానం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులకు భారీగా అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్తీకమాసం సందర్భంగా అర్చకుడు భోగాపురం కార్తికేయ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం జరిపించారు. అనంతరం చుట్టుపక్కల గ్రామాల భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

మార్మోగిన గోవింద నామం



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న వేద పండితులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలిసారిగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పవిత్ర ప్రతిష్ఠ చేశారు. అదేవిధంగా శనివారం పవిత్ర సమర్పణ నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. గోవిందా గోవిందా అంటూ శ్రీవారి నామంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం అనంతరం ఉత్సవమూర్తులు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట హంసవన పుణ్యక్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం శ్రీ శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

మైక్ సెట్ ప్రారంభం

పద్మనాభం: మద్ది గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద మైక్ సెట్‌ను ఎంపీపీ కంటుబోతు రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ మైక్ సెట్‌ను మద్ది గ్రామానికి చెందిన కంటుబోతు శ్రీనివాసరావు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో యాక్సెస్ టెక్నాలజీదే కీలకపాత్ర



మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ డీజీఎం సత్యప్రసాద్

తగరపువలస: భవిష్యత్‌లో ల్యాండ్ స్కేప్‌లో యాక్సెస్ టెక్నాలజీదే కీలకపాత్ర అని బీఎస్ఎన్ఎల్ విశాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.సత్యప్రసాద్ అన్నారు. భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు జరగనున్న ఫ్యాకల్టీ షార్ట్ టర్మ్ ట్రెనింగ్ ప్రోగ్రాంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అధ్యాపకులు, నిపుణుల కోసం యాక్సెస్ టెక్నాలజీలో తాజా పోకడలు, లోతుగా పురోగతి సాధించడానికి ఇలాంటి వేదికలు లక్ష్యంగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి కేపీ వినయ్, ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ అడ్మినిస్ట్రేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జాయింట్ డైరెక్టర్ లావణ్య, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జీవీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి వినతి



జోనల్ ఆఫీసులో ఏసీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మధురవాడ: తుపాను ప్రభావంతో జీవీఎంసీ 5వ వార్డు శారదానగర్ కొండపై కూలిపోయిన కొండచరియ స్థానంలో తక్షణమే రిటైనింగ్ వాల్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు సీపీఎం నాయకులతో కలిసి మధురవాడ జోనల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే కొండచరియలు విరిగిపడడంతో 2 ఇళ్లు కూలేందుకు సిద్ధంగా వున్నాయన్నారు. దీంతో అధికారులు ఆ ఇళ్లలోని వారిని ఖాళీ చేయించారన్నారు. పక్కనే ఉన్న ఇతర నివాసాలకు కూడా ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.అప్పలరాజు, ఐద్వా నాయకురాలు బి.భారతి, సుజాత, త్రిమూర్తులు, మోహన్, ఎల్.పద్మ, దాలినాయుడు పాల్గొన్నారు.

• జీవీఎంసీ 5వ వార్డు మారికవలస శారదానగర్‌లో కొండ చరియలు విరిగి పడిపోయిన ప్రాంతాన్ని మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్‌సీపీ నాయకులు జేఎస్ రెడ్డి, రుషికేష్ పరిశీలించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి, బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

వుడా కాలనీలో రక్తదాన శిబిరం



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న శ్రీధర్ తదితరులు

మధురవాడ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ బ్రాంచి ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు సిబ్బంది, కస్టమర్లు రక్తదానం చేశారు. రక్తదాతలకు మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ నక్కా శ్రీధర్, బ్రాంచి మేనేజర్ గణపతి ధ్రువపత్రాలు అందజేశారు.

మైనారిటీలకు సీఎం జగన్ పెద్దపీట



షాదీఖానాలో వసతుల కల్పనకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: రాష్ట్రంలో మైనారిటీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట వద్ద రూ.48.70 లక్షలతో చేపట్టనున్న షాదీఖానా మరమ్మతులు, అదనపు వసతుల కల్పన కోసం ఆయన శుక్రవారం భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మైనారిటీలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలుచేసి దేశంలోనే ఖ్యాతి గడించారన్నారు. 2004లో నిర్మించిన షాదీఖానాకు గత టీడీపీ ప్రభుత్వంలో వసతులు కల్పించలేకపోయారన్నారు. జెడ్పీ బి.రాము, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, సచివాలయాల కన్వీనర్ జగుపల్లి ప్రసాద్, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, చిల్ల భాస్కరరెడ్డి, కొప్పుల రమేష్, జీరు సుజాత, పందిరి విజయ్, తమ్మిన నరసింగరావు, సిమ్మల ప్రసన్న, కొప్పుల కృష్ణ, లెంక రమేష్, జామియా మసీదు ప్రతినిధులు ఉమర్‌బాయి, ఇషాత్ ఆలీ, యూసఫ్, గౌస్, షేక్ అబ్దుల్ గఫూర్, హుస్సేన్, ఇస్మాయిల్, యాసీన్, సమీర్, సలీం, అక్బర్, ఖాసిం, షరీఫ్, సుభానీ, యాకూబ్, ఎం.ఎ.లతీబ్, బాబ్జీ, భాషా, ముజీబ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



జీవీఎంసీ 6వ వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది : రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినిమాల్లో నటించేవారికి ప్రజా సంక్షేమంపై అవగాహన ఉండదన్నారు. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టి ఎవరి కోసం పోరాటం చేస్తున్నారో ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధితోపాటు అన్ని వర్గాలకూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో నూతన సంస్కరణలు, వినూత్న కార్యక్రమాలతో దేశం అంతా ప్రశంసించేలా పాలన సాగిస్తున్నామన్నారు. వలంటీర్లు అందరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతీ ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. రానున్న రోజుల్లో రాజధానికి ఈ ప్రాంతం కీలకంగా మారనుందని, ముఖ్యమంత్రి జగన్ ఇక్కడి నుంచే పరిపాలన సాగిస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జి గుడ్ల పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, మాదు చంటి, నొడగల రాంబాబు, అప్పలరాజు, బెందాళం పద్మావతి, చిల్లా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కే అండగా నిలుస్తాం

పీఎం పాలెం : బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డినే మరోమారు ముఖ్యమంత్రిని చేస్తామని ప్రజలు ముక్తకంఠంతో అన్నారు. 'ఆంధ్రపదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 6వ వార్డు గాయత్రినగర్‌లో శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ పతాకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వల్ల సామాన్యులకు సేవలు చేరువయ్యాయన్నారు. ప్రస్తుత సీఎం జగన్ పాలనకు గత ప్రభుత్వానికి పోలికే లేదన్నారు. గతంలో పింఛన్ల కోసం ఎన్నో ఇబ్బందులకు గురయ్యామని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఇంత కంటే మెరుగైన పాలన టీడీపీ అందిస్తుందంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫ్యాను గుర్తుకు ఓటేసి తనను గెలిపిస్తే, మరోమారు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గాదె రోశిరెడ్డి, సియ్యాద్రి కనకరాజు, వాంద్రాసి రవి, జామి శివకుమార్, కె.వరలక్ష్మి, అప్పారావు, సూరి అప్పారావు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలోనే సంక్షేమ పథకాలు



జీవీఎంసీ 5వ వార్డు శారదానగర్‌లో పతాకావిష్కరణలో నాయకులు



జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మధురవాడ: అన్ని వర్గాలు మెచ్చేలా సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమని పలువురు నాయకులు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 5వ వార్డు శారదానగర్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల ఫ్లెక్సీలు, వైఎస్సార్‌సీపీ పతాకాలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జేఎస్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఎం.రమణమ్మ, బి.సుజాత, ఎస్.కామేష్, ఎం.రామారావు, బి.సూర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు జగ్గుపిల్లి నరేష్, బీసీ సెల్ నాయకులు పోతిన పైడిరాజు తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్లు, గృహ సారథులు నాగోతి శాంతి, పోతిన అప్పలరాజు, అడ్డరి ధనలక్ష్మి పాల్గొన్నారు.

ముచ్చర్ల భూములపై రైతులకు పూర్తి హక్కులు

- సీఎం జగన్ ఆదేశాలతో సత్వర చర్యలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ఆనందపురం : రైతులను అన్ని రకాలగా ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ముచ్చర్ల రైతులకు తొందరలోనే పూర్తి హక్కులు కల్పిస్తామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ముచ్చర్లలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇనాం, మాన్యాస్, డి పట్టా భూములను ఏళ్ల తరబడి రైతులు సాగు చేసుకుంటున్నా హక్కులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు పొందలేక ఇక్కట్లు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో అర్హత గల రైతులందరికీ భూములపై సర్వహక్కులు కల్పించే ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని చెప్పారు. ముచ్చర్లలో ఐదు రోజుల్లో సర్వే ప్రారంభమవుతుందని, పూర్తయిన వెంటనే రైతులందరికీ పట్టాదారు పాసు పుస్తకాలను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. ఇప్పటికే బోని, శిర్లపాలెం గ్రామాల్లో ఇనాం భూముల రీ సర్వే పూర్తయిందని తెలిపారు. ఇటీవల తుపానుతో జరిగిన నష్టాన్ని గ్రామాల వారీగా అంచనా వేస్తున్నారని, బాధిత రైతులందరికీ పరిహారం అందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారని చెప్పారు. సాంకేతిక కారణాలు వల్ల సచివాలయ సిబ్బంది తమ విధులను కణమాం పంచాయతీలో నిర్వహిస్తున్నారని, అందులో భాగమైన ముచ్చర్ల గ్రామంలో వారానికి రెండు రోజులు పూర్తి స్థాయి సేవలను సచివాలయ సిబ్బంది అందించే విధంగా ఆదేశాలిచ్చామని వివరించారు. ముచ్చర్ల పంచాయతీలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15.60 కోట్లు వ్యయం చేసిందన్నారు. ఈ సందర్భంగా రూ.1.60 కోట్లతో నిర్మించనున్న మంచినీటి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ షిణగం యర్రయ్య, ఎంపీటీసీ సభ్యుడు గుసిడి ముత్యాలు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, నాయకులు పిన్నింటి వెంకట రమణ, లొడగల రమణ, షిణగం అప్పలరాజు, కోరాడ ముసిలి నాయడు, కోన శ్రీను, గొంప సన్యాసిరావు, రౌతు శ్రీను, యర్ర అప్పలనాయుడు పాల్గొన్నారు.

హాస్టల్ మెస్ తనిఖీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థుల హాస్టల్ మెస్‌ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత ప్రత్యక్షంగా పరిశీలించారు. మెస్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారీ, సరఫరా వ్యవస్థలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

నేటి నుంచి సంకల్ప యాత్ర ప్రచారం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఈఈసీ ప్రచార రథం ద్వారా 40 రోజులపాటు నిర్వహించనున్నామని, తొలి విడత ఈ నెల 9 నుంచి 14 రోజులపాటు ప్రచారం ఉంటుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పథకాల కింద అర్హులైనప్పటికీ ఇప్పటి వరకు ప్రయోజనం పొందని వారికి సహాయం అందించడం, పథకాలపై అవగాహన కల్పించడం సంకల్పయాత్ర ఉద్దేశమన్నారు. జీవీఎంసీ పరిధిలో 8 జోన్లలో 40 రోజులపాటు ఈ కార్యక్రమం జరగనుందని కమిషనర్ తెలిపారు.

విక్టోరియా విశ్వవిద్యాలయ బృందం పర్యటన



భీమిలి కేథరిన్ పబ్లిక్ స్కూల్‌లో విక్టోరియా విశ్వవిద్యాలయ బృందం

తగరపువలస: మెల్‌బోర్న్‌లోని విక్టోరియా విశ్వవిద్యాలయానికి చెందిన 27 మంది బృందం భారతదేశ అధ్యయన కార్యక్రమంలో భాగంగా భీమిలిలోని కేథరిన్ విద్యా సంస్థలను శుక్రవారం సందర్శించింది. ఇక్కడ పరస్పర బోధన విధానాలు, నూతన పోకడలు, వృత్తిపరమైన అభివృద్ధి, ప్రయోజనకరమైన అభ్యసన వాతావరణం సృష్టించడంపై 2016 నుంచి భాగస్వామ్యం కొనసాగుతున్నట్టు విక్టోరియా విశ్వవిద్యాలయ బృందం తెలిపింది. ఈ అవగాహన కార్యక్రమం శనివారం ముగియనుంది. ఆస్ట్రేలియా దేశంలో అనుసరిస్తున్న విద్యాబోధనను ఇక్కడి 8, 9 తరగతి విద్యార్థులకు పరిచయం చేశారు. ఉత్తమ అభ్యాసాలు, వినూత్న బోధనలు రెండు దేశాల మధ్య పంచుకోవడం, మెరుగు పరచుకోవడం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని కేథరిన్ విద్యాసంస్థల చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి తెలిపారు.